సాక్షి నాగర్‌కర్నూల్

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



కలెక్టరేట్ భద్రమేనా..?

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ నిర్మించి మూడేళ్లు కూడా పూర్తి కాలేదు.. చిన్నపాటి వర్షాలకే లోనికి నీరు చేరుతోంది.

-8లో ▸



జూరాలకు భారీగా వరద

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు గురువారం 3.65 లక్షల క్యూసెక్కుల వరద చేరింది.

-8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.7 /20.8

ఉదయం, సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

‘పనుల జాతర’కు ఏర్పాట్లు పూర్తి

కందనూలు: నూతన గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) ద్వారా చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, ఇందిరా మహిళా శక్తి, ఉపాధి భరోసా కింద వ్యక్తిగత ఆస్తుల కల్పన పనులు, జల నిధి కింద వాన నీటి సంరక్షణ–భూగర్భ జలాలు పెంచే ఫారం పాండ్స్, ఊట కుంటలు వంటి పనులను శుక్రవారం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఆర్‌డీఓ చిన్నఓబులేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో ఎక్కువ రోజులు పనిచేసిన కూలీలను, దివ్యాంగులను, పారిశుద్ధ్య కార్మికులను, హరిత సంరక్షకులను సన్మానించనున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం చేస్తే ఊరుకోం



అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల ప్రమోషన్లలో రిజర్వేషన్ అమలు చేయకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మ నాయక్ ఆరోపించారు. గురువారం అచ్చంపేటలో గిరిజన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సర్వీసు గుర్తించి వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, దశరథ నాయక్, లక్పతినాయక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



వెల్దండ: సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని జిల్లా వైద్యాధికారి రవికుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల వర్షాలు రావడంతో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా వాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, పర్యవేక్షణ అధికారి మురళి, ఫార్మసీ ఆఫీసర్ అనిత, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, యూడీసీ శోభా, ఏఎన్‌ఎం సూర్యకళ తదితరులు ఉన్నారు.

అసువులు బాసిన ఇంజినీర్లకు ఘన నివాళి

దోమలపెంట: భూగర్భ విద్యుత్ కేంద్రంలో 2020 ఆగస్టు 20న జరిగిన అగ్నిప్రమాదంలో అసువులు బాసిన ఇంజినీర్లు, ఉద్యోగులకు గురువారం భూగర్భ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఎస్‌ఈలు ఆదినారాయణ, రవీంద్రకుమార్, డీఈ, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్థూపం ఏర్పాటు చేయాలి

భూగర్భకేంద్రం జరిగినలో అగ్నిప్రమాదంలో మరణించిన ఇంజినీర్లు, ఉద్యోగుల జ్ఞాపకార్థంగా స్థూపం ఏర్పాటు చేయాలని జెన్‌కో–1535 సంఘం రాష్ట్ర కార్యదర్శి లవకుమార్ డిమాండ్ చేశారు.



ద్విచక్ర వాహనంలో కట్లపాము

కోర్టుకు హాజరైన తేజేశ్వర్ హత్య కేసు నిందితులు

వృద్ధుడి దారుణ హత్య

వివరాలు 8లో ▸

స్టేడియం ఊసేది..?

ఒక అడుగు ముందుకు.. పది అడుగులు వెనక్కి



విస్తరణకు నోచుకోని అచ్చంపేటలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం

- ఇండోర్ స్టేడియం విషయంలోనూ ఇదే పరిస్థితి
- సౌకర్యాలు లేకున్నా జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు
- రూ.10కోట్లు మంజూరైన మొదలు కాని పనులు

అచ్చంపేట: జిల్లాలో అత్యంత ప్రతిభావంతమైన క్రీడాకారులు ఉన్నా.. సాధన చేసేందుకు సరైన స్టేడియాలు, వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ, రాష్ట్ర, జోనల్ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు జిల్లాలో కొకొల్లలు. అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్‌లో ఇండోర్ స్టేడియాలు ఉన్నా నిర్వహణ లేక క్రీడాకారులకు అనుకూలంగా లేవు. కల్వకుర్తిలో ఫుట్‌బాల్ కోచ్ మినహా ఎక్కడ కూడా కోచ్‌లు లేరు. నాగర్‌కర్నూల్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మించాలనే డిమాండ్ ఉన్నా ఆచరణ సాధ్యం కావడం లేదు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ నైపుణ్యాలు ఉన్న క్రీడాకారులను వెలికితీస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనలు ఇస్తున్నా.. ఆయన పుట్టిన సొంత జిల్లాలో స్టేడియాల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది.

22 ఏళ్లుగా అసంపూర్తిగానే..

ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం 2003 డిసెంబర్ 8న అప్పటి ప్రభుత్వం రూ.60లక్షలు మంజూరు చేయగా.. అప్పటి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి పి.రాములు శంకుస్థాపన చేశారు. 2004లో ప్రభుత్వం మారడంతో రూ.10లక్షలు ఖర్చు చేసి చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. 2011 నవంబర్‌లో ఎమ్మెల్యే రాములు రూ.20లక్షలు కేటాయించి పనులు మొదలు పెట్టగా.. భవన నిర్మాణం, షెడ్డు పిల్లర్లు పనులు పూర్తి చేశారు. రూ.30లక్షలు ఖర్చు చేసినా స్టేడియం పనులు పూర్తి కాలేదు. 2013 జూన్‌లో స్పోర్ట్స్ అథారిటీ నుంచి మరో రూ.30లక్షల నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ షెడ్డు నిర్మాణం పూర్తి చేసి వదిలేశారు. సింథటిక్ గ్రౌండ్, గ్యాలరీ, సైడ్ వాల్స్, ప్లాట్‌ఫాం, లైటింగ్, డ్రెసింగ్ రూం, ఆఫీసు రూం పనులు చేయాల్సి ఉంది. ఇండోర్ స్టేడియానికి అవసరమైన నిధులు మంజూరు చేయడంలో తర్వాత అధికారంలో వచ్చిన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, గువ్వల బాలరాజు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. 2019లో రూ.2కోట్ల నిధులు మంజూరైన ఇంత వరకు పనులు మొదలు కాలేదు. అచ్చంపేట ప్రాంతంలో షటిల్ క్రీడాకారులున్నా.. కోర్టులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక పబ్లిక్ క్లబ్, ఇతరులు ప్రతి ఏటా డివిజన్, జిల్లా స్థాయి షటిల్ పోటీలు నిర్వహిస్తున్నారు. పబ్లిక్ క్లబ్, ప్రైవేట్ వ్యక్తులు వేరువేరుగా రెండు షటిల్ ఇండోర్ నిర్మాణాలు చేపట్టారు.

విస్తరణకు నోచుకోని ఎన్టీఆర్ స్టేడియం

నల్లమలలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గతంలో అచ్చంపేటలో ఎన్టీఆర్ మినీ స్టేడియం నిర్మించారు. ఆ తర్వాత ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభించడంతో క్రీడాకారుల్లో ఆశలు చిగురించాయి. ప్రస్తుతం ఉన్న స్టేడియంలో కొన్నేళ్లుగా ప్రతి ఏటా రెండు పర్యాయాలు జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. అందుకు అనుగుణంగా 2021లో స్టేడియం చుట్టూ ఉన్న ప్రహరీని కూల్చి కొంత దూరం పొడిగించారు. అక్కడక్కడ లైటింగ్ ఏర్పాటు చేసిన సౌకర్యాలు మరిచారు. 2018లో రూ.1.5కోట్లు, 2023లో రూ.6.50కోట్లు నిధులు మంజూరైన పనులు ప్రారంభించలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లినట్లు సమాచారం. స్టేడియం విస్తరణ పనులు చేపట్టి రాజీవ్‌ఎన్టీఆర్ పేరుగా మారుస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రకటించినా.. ఇంత వరకు ఆచరణకు నోచుకోలేదు.

స్టేడియం విస్తరణ పనులు చేపట్టాలి



ఎన్టీర్ మినీ స్టేడియం, ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలి. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంతో మంది క్రీడాకారులు పతకాలు సాధించినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మధ్యలోనే ఆపేస్తున్నారు. ప్రభుత్వం సహాయ సహకారాలు అందించి క్రీడాభివృద్ధికి కృషి చేయాలి.

– ఎంఎస్‌గౌడ్, ఏఆర్‌ఎం క్రికెట్ అకాడమీ హెడ్‌కోచ్

కోచ్‌లకు గుర్తింపు ఇవ్వాలి



స్టేడియం కోసం వందలాది క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు. తగిన సౌకర్యాలు కల్పించనప్పటికీ మా వంతుగా క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాం. నాలాంటి ఎంతో మంది కోచ్‌లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారు. అందుబాటులో స్టేడియాలు లేక ఖాళీ స్థలాలు, మైదానాల్లో శిక్షణ పొందుతున్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా కోచ్‌లను అభినందించలేదు. పతకాలు సాధించిన తర్వాత ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

– ఎద్మ శ్రీనుయాదవ్, మాస్టర్ అథ్లెటిక్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి



అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



చర్ల తిర్మలాపూర్ వద్ద పూర్తిగా నీట మునిగిన రోడ్డును పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ తదితరులు

- రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్

నాగర్‌కర్నూల్: జిల్లాలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలను అధికార యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కొందని, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారని రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ కొనియాడారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విపత్తు నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో పాటు అన్ని విభాగాల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కన్నా అత్యధికంగా వర్షపాతం నమోదైందని, మరోసారి అల్పపీడనం ఏర్పడే హెచ్చరికలు ఉన్నందున నెల రోజుల పాటు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. క్లౌడ్ బరస్ట్ జరిగితే స్పందించాల్సిన విధానంపై అధికారులకు అవగాహన కల్పించారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఆయా శాఖలకు సంబంధించి నష్ట వివరాలను కలెక్టర్ అందించాలన్నారు.

పూడికతీతలో వేగం పెంచాలి

జిల్లాలో ప్రధానంగా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో నాలాల్లో పూడికతీత పూర్తి చేయాలని, వరద నీరు వేగంగా బయటకు వెళ్లేలా చూడాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది, డీఆర్‌ఎఫ్ బృందాలు ముంపు ప్రాంతాల్లో చేపట్టే సహాయక చర్యల్లో కీలకంగా వ్యవహరించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎండీఆర్‌ఎఫ్ ద్వారా ముందస్తు చర్యలు పక్కాగా చేపడితే ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవచ్చన్నారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ

విపత్తు సహాయ చర్యల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు టోల్ ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచామని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. వర్షపాత తీవ్రతను గుర్తించి అధికారులు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఆగస్టు 14న జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైందని, వరద నీటి ప్రవాహం కారణంగా లోలెవెల్ కాజ్‌వేలు మునిగిపోగా.. భారీకేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించామని వెల్లడించారు. అంతకుముందు నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని చర్లతిర్మలాపూర్, సిర్సవాడలో వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను వారు పరిశీలించారు. వరదలతో ధ్వంసమైన రహదారులు, చెరువులు, వాగులు, వంతెనలు, తాగునీటి సౌకర్యాలు, వ్యవసాయ పొలాలు, విద్యుత్ లైన్లకు వీలైనంత వేగంగా మరమ్మతు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘పరిమితికి మించి ఎరువులు వాడొద్దు’

బిజినేపల్లి: రైతులు పొలానికి సరిపడా యూరియా మాత్రమే వినియోగించుకోవాలని, అధికంగా వాడడం ద్వారా ఆ ప్రభావం పంట దిగుబడిపై పడే ప్రమాదం ఉందని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మన గ్రోమోర్ క్రిమి సంహారక మందుల విక్రయకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెల్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నిర్వాహకులకు హెచ్చరించారు. యూరియాను కేవలం వ్యవసాయ అవసరాల కోసం మాత్రమే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ యశ్వంత్‌రావు, ఏడీఏ పూర్ణచంద్రారెడ్డి, ఏఓ కమల్‌కుమార్, రైతులు ఉన్నారు.

బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను గురువారం కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల భవనం, తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రతపై పాఠశాల హెచ్‌ఎంతో సమీక్షించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, బోధన నాణ్యత, మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్ల వాడకం వంటి వాటిపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వారిలో గణితం పరిజ్ఞానాన్ని పరిశీలించి, అనంతరం బోధన చేశారు. గణితాన్ని సులభంగా ఎలా అర్థం చేసుకోవాలో వివరించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని చదవాలని సూచించారు.

12 గంటలు దాటినా విధులకు రాలే..

- తహసీల్దార్‌పై ఎమ్మెల్యే అసహనం
- ఫోన్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు

లింగాల: విధులను విస్మరించే అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హెచ్చరించారు. ఎమ్మెల్యే గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ఆయా విభాగాలను పరిశీలించిన ఎమ్మెల్యే తహసీల్దార్‌తో పాటు కింది స్థాయి సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో సకాలంలో పనులు కాకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని మండిపడ్డారు. మధ్యాహ్నం 12 గంటలయినా తహసీల్దార్ విధులకు రాకపోవడం ఏమిటని విస్మయం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న వారిని స్థాన చలనం కల్పిస్తామన్నారు. కార్యాలయంలో ముడుపుల వ్యవహారం జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆరోపించారు. అధికారుల పనితీరు గురించి కార్యాలయం నుంచే కలెక్టర్‌తో మాట్లాడారు. పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరారు.



లింగాల తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

భూ భారతికి సంబంధించి మొత్తంలో 5,836 దరఖాస్తులు రాగా.. అధికారుల నిర్లక్ష్యం వల న వాటి పరిష్కారంలో జాప్యం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మండలంలోని అవుసలికుంటలో జరిగిన ఓ కార్యక్రమంలో మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ తిరుపతిరెడ్డితో పాటు లింగాల, ఎంసీ, డీసీ తండాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణులు ఎమ్మెల్యే వంశీకృష్ణ, రాష్ట్ర నాయకుడు రంగినేని శ్రీనివాస్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివ, మాజీ ఎంపీటీసీ రాంబాబు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ‘డీఎం’

కల్వకుర్తి టౌన్: డిపో పరిధిలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా డీఎం సుభాషిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి గంటపాటు కార్యక్రమం ఉంటుందని, ఫోన్ చేయాల్సిన వారు 99592 26292 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యూరియా కోసం బారులు

- రెండు సంచులే ఇస్తుండడంపై అభ్యంతరం

పెద్దకొత్తపల్లి: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మొక్కజొన్న, పత్తి పంటకు పైపాటి ఎరువుగా వాడేందుకు యూరియా కోసం రైతులు గురువారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయానికి బారులు తీరారు. సింగిల్ విండో అధికారులు ఒక్కొక్క రైతుకు కేవలం రెండు బస్తాల యూరియాను అందజేస్తుండడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువ పొలం సాగుచేసిన రైతులకు రెండు సంచుల యూరియా ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సింగిల్ విండో ద్వారా ఇప్పటి వరకు 20 లారీల యూరియాను రైతులకు సరఫరా చేశామన్నారు. మరో 20 లారీల యూరియా రైతులకు అవసరం ఉంటుందని అంచనా వేశారు.



పెద్దకొత్తపల్లిలో యూరియా కోసం బారులుతీరిన రైతులు

ప్రారంభానికి ‘ట్రిపుల్ ఐటీ’ సిద్ధం

వచ్చేవారం ఓరియంటేషన్ కార్యక్రమాల నిర్వహణ

- ఇప్పటికే ఎస్సెస్సీ మెరిట్ ఆధారంగా 208 మందికి అడ్మిషన్లు
- ఇంటర్మీడియట్‌తో పాటు ఇంజినీరింగ్ చదివేందుకు వెసులుబాటు
- బండమీదిపల్లి వద్ద ఉన్న రెడ్డి హాస్టల్ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు
- టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది నియామకాలు చేపడుతున్న బాసర అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలను జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయనుంది. దీంతో పాలమూరు చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభం కానుంది. కళాశాల ఏర్పాటుకు అధికారులు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని బండమీదిపల్లి వద్ద ఉన్న రెడ్డి హాస్టల్ భవనంలో తాత్కాలికంగా కళాశాల ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అక్కడ విద్యార్థులకు, ప్రత్యేక తరగతి గదులతోపాటు అడ్మిషన్ పొందిన ప్రతి ఒక్కరికి హాస్టల్ గదులు, డైనింగ్ హాల్ వంటివి సదుపాయాలు కల్పించనున్నారు.



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీ కళాశాల

ఆన్‌లైన్ విధానంలోనే..

ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు మొదటి సంవత్సరం కావడంతో అడ్మిషన్ల ప్రక్రియ అంతా కూడా యూనివర్సిటీ నుంచి నేరుగా ఆన్‌లైన్ విధానంలో జరిగింది. ఈ మేరకు ఎస్సెస్సీలో అత్యధిక మార్కులు సాధించిన 208 మంది విద్యార్థులకు రిజర్వేషన్ల ఆధారంగా ప్రస్తుతం 144 మంది బాలికలు, 64 మంది బాలురకు అవకాశం కల్పించారు. ఇక స్టాఫ్ నియామకాల ప్రక్రియను సైతం అధికారులు పూర్తిచేశారు. గత నెల టీచింగ్ సిబ్బంది నియామకానికి ప్రకటన ఇవ్వగా.. 31 మంది దరఖాస్తు చేసుకుంటే 9 మందిని వివిధ డిపార్ట్‌మెంట్లకు సంబంధించి అధ్యాపకులను భర్తీ చేశారు. మరో 6 మంది నాన్ టీచింగ్ సిబ్బందిని సైతం నియమించినట్లు తెలుస్తోంది. ఇందులో వార్డెన్లు, అటెండర్లు, స్వీపర్ ఇతర సిబ్బంది ఉన్నారు.

ఇప్పటికే తరగతులు ప్రారంభం కావాల్సి ఉండగా.. వర్షాల కారణంగా ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వచ్చే వారం కళాశాలను ప్రారంభించి.. అక్కడే విద్యార్థులు, తల్లిదండ్రులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. కాగా.. రెగ్యులర్ కళాశాల భవనం కోసం జిల్లాకేంద్రం సమీపంలోని దివిటిపల్లి వద్ద 40 ఎకరాల భూమిని ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. వీటిలో త్వరలో పూర్తిస్థాయి నిర్మాణాలు చేపట్టనున్నారు.

అవకాశాలతో మేలు..

సాధారణంగా ఇంజినీరింగ్ చేసే విద్యార్థులకు ఇంటర్మీడియట్ తర్వాత ఎఫ్ సెట్ వంటి పోటీ పరీక్షలు రాస్తే సీటు లభించే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం ట్రిపుల్ ఐటీలో ఎస్సెస్సీ పూర్తయిన తర్వాత నేరుగా మొదటి సంవత్సరంలో అడ్మిషన్‌ను పొందవచ్చు. ఇది ఇంటిగ్రేటెడ్ కోర్సులు కావడంతో 2 ప్లస్ 4 విధానంలో విద్యాబోధన జరుగుతుంది. మొదటి రెండేళ్లు అందరికీ కామన్ సిలబస్ ఉండగా.. తర్వాత మరో నాలుగేళ్లు వివిధ డిపార్ట్‌మెంట్‌లు విడిగా తరగతులు బోధించాల్సి ఉంటుంది. ఇందులోనే ఇంటర్‌తోపాటు ఇంజినీరింగ్ విద్య కూడా పూర్తి అవుతుంది. ఒక విద్యార్థి ఎస్సెస్సీ తర్వాత అడ్మిషన్ పొందితే నేరుగా ఇంజినీరింగ్ సర్టిఫికెట్‌తో బయటికి వచ్చి.. ఉద్యోగం పొందేందుకు సంసిద్ధంగా ఉంటారు.

ఉజ్వల భవిష్యత్..



పాలమూరులో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేయడం గొప్ప విషయం. ఇక్కడ చేరిన విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేసి బయటికి వచ్చే అవకాశం ఉండటంతో వారికి ఉజ్వల భవిష్యత్ లభిస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు సాధ్యపడింది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్‌లో ఇంజినీరింగ్ కళాశాలలు రావడంతో భవిష్యత్‌లో వేల సంఖ్యలో సీట్లు కేటాయించే అవకాశం ఉంది. తద్వారా కార్పొరేట్ కంపెనీలు జిల్లాకు వచ్చి.. ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తాయి. కళాశాలలో విద్యార్థులకు తరగతి గదులు మొదలు, హాస్టల్ ఇతర వసతులు కూడా కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది.

– యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి


మృతుడు పిట్టల లక్ష్మయ్య(ఫైల్)

లింగాల: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని వల్లభాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాలిలా.. వల్లభాపూర్‌కు చెందిన పిట్టల లక్ష్మయ్య(65) ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. అయితే, గురువారం గ్రామ శివారులోని జంబులమ్మ కుంటలో లక్ష్మయ్య మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వచ్చి పరిశీలించారు. చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య రాములమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

నవాబుపేట: కుటుంబంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన చెంచు రాజు(34) కొంతకాలంగా ఎలాంటి పనులు చేయకుండా మద్యం తాగి తిరుగుతుండేవాడు. భార్య కూలిపనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఆర్థిక ఇబ్బందుల వల్ల భార్యాభర్తల మధ్య గొడవలు అయ్యేవి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన రాజు బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు వేసుకొని ఇంటిపైకప్పుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలిపనికి వెళ్లిన భార్య లక్ష్మమ్మ ఇంటికొచ్చి చూడగా వేలాడుతున్న భర్త మృతదేహం కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతనికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానవపాడు: ఫీట్స్ ట్యాబ్లెట్స్ ఎక్కువగా మింగి వ్యక్తి స్పృహ కోల్పోయి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందిన ఘటన మండలంలోని చెన్నిపాడులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ కథనం ప్రకారం.. మానవపాడు మండలంలోని చెన్నిపాడుకు చెందిన ఉల్చా శ్రీరాములు(50) పెళ్లి అయిన నాటినుంచి ఫిట్స్ వస్తుండేవి. రెండేళ్లుగా మతిస్థిమితం లేకుండా ఉన్నాడు. అందుకు కర్నూల్ ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో సైకియాట్రిస్ట్ దగ్గర చికిత్స పొందుతూ మందులు వాడుతున్నాడు. ఈనెల 20వ తేదీన ఉదయం భార్య కంగాలమ్మ కూలి పనులకు వెళ్లగా.. ఇంట్లో ఎవరూలేని సమయంలో శ్రీరాములు ఫిట్స్ వాడే ట్యాబ్లెట్లు అధిక మోతాదులో తీసుకోవడంతో స్పృహ కోల్పోయాడు. భార్య సాయంత్రం పనినుంచి ఇంటికి వచ్చి చూసి శ్రీరాములును కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స నుంచి కోలుకోలేక గురువారం రాత్రి మృతిచెందాడు. భార్య కంగాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వనపర్తి పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాయిగడ్డ కాలనీకి చెందిన జానంపేట రమేష్ (36) బుధవారం రాత్రి పట్టణంలోని నల్ల చెరువు వద్ద కావలి ఉండడానికి వెళ్లాడు. గురువారం ఉదయం రమేష్ చెరువు అలుగు వద్ద బురదలో పడి ఉండడాన్ని చూసిన తోటి కావలి వారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య జానంపేట రేణుక చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

గద్వాల క్రైం: ఈ నెల 18న పొరహక్కుల నేతపై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేసిన సంఘటనపై మల్దకల్ పోలీసులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ మొగిలయ్య కథనం మేరకు.. మల్దకల్ మండలం ఎల్కూర్ గ్రామానికి చెందిన పొరహక్కుల నేత మహేష్‌కు అదే గ్రామానికి చెందిన బోయనీలి బీసన్న, బోయనీలి పాండులకు పలు విషయాలపై గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో గత నాలుగు రోజుల క్రితం గ్రామంలో టీ స్టాల్ వద్ద మహేష్ టీ తాగుతుండగా ఇద్దరు వ్యక్తులు పాత కక్షలు మనస్సులో పెట్టుకుని కత్తితో దాడి చేశారు. ఈ సంఘటనపై అదేరోజు మల్దకల్ పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను గురువారం ఉదయం అరెస్టు చేసి విచారణ చేపట్టడంతో నేరం అంగీకరించారు. నిందితులను గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

మన కలెక్టరేట్ భద్రమేనా..?


మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని ఈఈ చాంబర్‌లో ఊడిపడిన పీఓపీ

- ఆర్‌అండ్‌బీ ఈఈ చాంబర్‌లో ఊడిపడిన పీఓపీ
- ఉద్యోగులకు తప్పిన ప్రమాదం
- చిన్నపాటి వానకు అక్కడక్కడ కురుస్తున్న వైనం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా అధికారుల సమీకృత భవనం(కలెక్టరేట్)లోని కొన్ని గదుల్లో పీఓపీ ఊడి పడడం, భవనానికి అక్కడక్కడ పగ్గులు రావడం చూస్తుంటే మన కలెక్టరేట్ భవనం భద్రమేనా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ భవనం నిర్మించి మూడేళ్లు కూడా పూర్తి కాలేదు.. అప్పుడే చిన్నపాటి వానలకు కురవడంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు గత ప్రభుత్వం ప్రతి జిల్లాకు జిల్లా అధికారుల సమీకృత భవనాలను నిర్మించింది. మహబూబ్‌నగర్ జిల్లా పాత కలెక్టరేట్ ఉండగా కొత్త కలెక్టరేట్‌ను జిల్లా కేంద్రంలోని పాలకొండ శివారులో నిర్మించారు. ఈ కొత్త కలెక్టరేట్ భవనం 2017 డిసెంబర్‌లో శంకుస్థాపన చేసి 2022 డిసెంబర్ 4వ తేదీన అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. 2023 ఆగస్టులో కురిసిన వానలకు భవనం ముందు భాగంలో వాన నీరు దిగువకు కారగా.. ఇంత నాసిరకంగా పనులు చేయడం ఏంటని, ఆర్‌అండ్‌బీ అధికారులు సరిగ్గా పర్యవేక్షించలేదనే విమర్శలు వినిపించాయి. దీంతో హుటాహుటీన అధికారులు స్పందించి కలెక్టరేట్ భవనం ముందు, వెనుక భాగంలో మరమ్మతులు చేపట్టారు.


కొత్త కలెక్టరేట్ భవనంపై మరమ్మతు (ఫైల్)

18 ఎకరాలు.. రూ.55.5 కోట్లతో నిర్మాణం

18 ఎకరాల్లో రూ.55.5 కోట్ల వ్యయంతోకలెక్టరేట్‌ను నిర్మించారు. ఇందులో మొత్తం 34 శాఖలు ఒకే చోట పాలన అందిస్తున్నాయి. మొదటి అంతస్తులో 13 శాఖలతో పాటు మంత్రికి (స్టేట్ చాంబర్ పేరుతో) ప్రత్యేక చాంబర్ కేటాయించారు. రెండవ అంతస్తులో 15 శాఖతో పాటు 31 మంది కూర్చునేలా మీటింగ్ హాల్ ఏర్పాటు చేశారు. పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం కొత్త జిల్లాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒక్క భవనంలో ఏర్పాటు చేయాలని భావించింది. అందులో భాగంగా ప్రతి జిల్లా కేంద్రంలో కొత్త కలెక్టరేట్ భవనాలను నిర్మించింది. ఇన్ని రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం అప్పుడే మరమ్మతులకు గురవడం, పీఓపీ ఊడిపడడం, విద్యుత్ లేని సమయంలో లిఫ్ట్ పనిచేయకపోవడంపై అటు ప్రజలు, ఇటు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఊడిపడిన పీఓపీ.. తప్పిన ప్రమాదం

కలెక్టరేట్ కార్యాలయంలోని రెండవ అంతస్తులోని రూం నెంబర్ 207 ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఉంది. బుధవారం రాత్రి చాంబర్‌లోని పీఓపీ ఒక్కసారిగా ఊడిపడింది. ఈఈ సీటు ముందు భాగంలో 4, 5 మీటర్ల పొడవుగా పడింది. ఈ సంఘటన ఉదయం జరిగి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేది. రాత్రి పూట కావడంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలాఉండగా, వర్షాకాలంలో చిన్నపాటి వానలకే కలెక్టరేట్‌లోని పలు గదుల్లో నుంచి నీరు దిగువకు వస్తున్నాయని, గోడలు సైతం చెమ్మ చేరుతుందని పలువురు పేర్కొన్నారు.

వృద్ధుడి దారుణ హత్య


ఘటన స్థలంలో సిబ్బందితో మాట్లాడుతున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

- పాన్‌గల్‌లో ఘటన స్థలాన్ని పరిశీలించిన వనపర్తి ఎస్పీ
- ఆధారాల కోసం క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ అన్వేషణ

పాన్‌గల్: వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో గురువారం ఎనుముల కిష్టయ్య (65)ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుంటి కిష్టయ్య గొర్రెల బేరం చేస్తూ ఒంటరిగా జీవనం సాగిస్తుండేవాడు. బుధవారం బోనాల పండుగ సందర్భంగా గ్రామంలోని పెద్ద కోడలు వెంకటమ్మ ఇంటికెళ్లి భోజనం చేయగా ఫోన్ రావడంతో బయటకు వెళ్లాడు. రాత్రి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై తీసుకొచ్చి ఇంటి వద్ద వదిలారు. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు లోనికి ప్రవేశించి పప్పుగుత్తి, పదునైన ఆయుధంతో ముఖం, చేతులు, ఛాతిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం ఉదయం అటుగా వెళ్తున్న ఓ మహిళ ఇంటి తలుపులు తెరిచి ఉండటం, కోతులు లోనికి వెళ్తుండటం చూసి పిలువగా ఎలాంటి స్పందన లేకపోవడంతో తలుపు దగ్గరకు వెళ్లి చూసింది. మంచంపై కిష్టయ్య ఎలాంటి కదలిక లేకుండా ఉండటంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. ఇద్దరు వ్యక్తులపై అనుమానం ఉన్నట్లు చిన్న కుమారుడు శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ వివరించారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఘటనా స్థలాన్ని క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు ఆధారాలు సేకరించారు.


ఎనుముల కిష్టయ్య (ఫైల్)

■ ఎస్పీ రావుల గిరిధర్ ఘటనా స్థలాన్ని, ఇంటి సమీపంలోని సీసీ కెమెరాలు, చుట్టుపక్కల పరిస్థితులను సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. వివరాలు సేకరించి పలు సూచనలు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేస్తున్నామని.. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ కృష్ణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

బైక్‌లో కట్లపాము


పాము

కొల్లాపూర్: మండలంలోని ఎల్లూరుకుకి చెందిన యువకుడు గణేశ్ బైక్‌లో కట్లపాము దాక్కుంది. ఎల్లూరు నుంచి కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గణేశ్ ప్యాషన్‌ప్లస్ బైక్‌పై గురువారం ఉదయం భయలుదేరాడు. పట్టణంలోని ద్వారకా లాడ్జ్ ముందు రోడ్డుపై వెళ్తుండగా బైక్ ముందు భాగంలో ఏదో కదులుతున్నట్లు కనిపించింది. అనుమానం వచ్చి బైక్‌ను ఆపుకొని చూడగా కట్ల పాము కనిపించింది. దాన్ని భయటకు తీసేందుకు కొద్దిసేపు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సమీపంలోని మెకానిక్ షాపు వద్దకు తీసుకెళ్లాడు. మెకానిక్ సద్దాం బైక్ పార్ట్స్ విప్పి పామును భయటికి లాగాడు. ఈ పాము దాదాపు మూడున్నర ఫీట్ల మేర పొడవు ఉంది. రాత్రి ఇంటిముందు పార్కుచేసిన సమయంలో బైక్‌లోకి పాము ఎక్కి ఉండొచ్చని గణేశ్ చెప్పాడు. పామువల్ల ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

తెలంగాణ సారస్వత పరిషత్ శాశ్వత సభ్యుడిగా 'కోట్ల'


కోట్ల వెంకటేశ్వరరెడ్డి


మెట్టుగడ్డ: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి తెలంగాణ సారస్వత పరిషత్ శాశ్వత సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి నియామక పత్రాన్ని కోట్ల వెంకటేశ్వరరెడ్డికి అందజేశారు. పరిషత్ సమావేశాలకు హాజరై తన సూచనలు, సలహాలు ఇవ్వాలని, పరిషత్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య కోట్లను అభినందించారు. తన నియామకంపై ఆనందం వ్యక్తం చేసిన కోట్ల పరిషత్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కోర్టుకు హాజరైన 'తేజేశ్వర్ హత్య' నిందితులు

గద్వాల క్రైం: జూన్17న గద్వాల పట్టణంలోని గంట వీధికి చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ సుపారీ గ్యాంగ్ చేతిలో దారుణహత్యకు గురైన ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన విషయం విధితమే. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జైల్‌లో రిమాండ్‌లో ఉన్న నిందితులు ఏ1 తిరుమలరావు, ఏ2 ఐశ్వర్య అలియాస్ సహస్ర, ఏ3 కుమ్మరి నగేష్, ఏ4 చాకలి పరశురాముడు, ఏ5 చాకలి రాజు, ఏ6 ఎ.మోహన్, ఏ7 తిరుపతయ్య (తిరుమలరావు తండ్రి), ఏ8 సుజాతలను గద్వాల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ ఎదుట పోలీసులు గురువారం ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో కేసుకు సంబంధించిన వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను నియమించుకున్నారా.. అని నిందితులను న్యాయమూర్తి ప్రశ్నించారు. అనంతరం నిందితులకు మరో 14 రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశాలు జారీ చేయగా.. పోలీసులు వారిని జైలుకు తరలించారు. ఏ7 తిరుపతయ్య మాత్రం బెయిల్ మీద ఉన్నాడు.


నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసు వాహనం

నేరాలే ప్రవృత్తిగా.. దొంగతనాలే పనిగా..


దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ గిరిధర్

వనపర్తి: నేరాలను ప్రవృత్తిగా మార్చుకుని దొంగతనాలు చేస్తున్న ఓ వ్యక్తిని వనపర్తి పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేరస్తుడి వివరాలు మీడియాకు వెల్లడించారు. ఉదయం జిల్లా కేంద్రంలోని మర్రికుంట సమీపంలో రూరల్ ఎస్‌ఐ, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఓ వ్యక్తి బైక్‌కు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలీలో విచారించగా దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుదుకున్నాడు. పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లికి చెందిన మీనుగ రమేష్ కొంత కాలంగా దొంగతనాలు చేయడం ప్రవృత్తిగా మార్చుకుని జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో చోరీలు చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అతని బైక్‌లో దొంగతనానికి వాడే వస్తువులతో పాటు అతని నుంచి రూ.11.43 లక్షల నగదు, 30గ్రాముల బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. నేరస్తుడిని పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన వనపర్తి సీఐ కృష్ణయ్య, వనపర్తి రూరల్ ఎస్‌ఐలు జలంధర్ రెడ్డి, వేణుగోపాల్, పోలీసు కానిస్టేబుళ్లు రఫీ, ఆంజనేయులు, నవీన్‌గౌడ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డు అందజేశారు.

కొత్త రోప్‌లు బిగించేలా చర్యలు


జూరాల ప్రాజెక్టు వద్ద వివరాలు తెలుసుకుంటున్న ప్రాజెక్టుల సీఈ నాగేందర్‌రావు

- సీఈ నాగేందర్‌రావు
- తెగిన రోప్‌ల ప్రాంతాన్ని పరిశీలించిన వైనం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును ఇరిగేషన్ సీఈ నాగేందర్‌రావు సందర్శించారు. గురువారం సాయంత్రం ఆయన పీజేపీ ఎస్‌ఈ రహీముద్దీన్‌తో కలిసి ప్రాజెక్టు వద్దకు చేరుకుని ప్రాజెక్టుకు వస్తున్న వరద వివరాలను తెలుసుకున్నారు. గేట్ల వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. తెగిన క్రస్టు గేట్ల రోప్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పైభాగం నుంచి తెగిన రోప్‌లను పరిశీలించారు. ప్రతి ఐదేళ్లకు ఒక సారి రోప్‌లను మార్చాలని, తెగిన రోప్‌ల స్థానంలో కొత్త రోప్‌లను బిగించాలని ఆదేశించారు. ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద ప్రవాహం వస్తున్న నేపథ్యంలో మున్ముందు మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం వస్తే ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్తగా రోప్‌లను బిగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఫ్లడ్ కంట్రోల్ రూం వద్దకు చేరుకుని ఎగువ నుంచి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు నుంచి ఎంత మేర నీటిని దిగువకు విడుదల చేశారనే సమాచారం తెలుసుకున్నారు. వరదల సమయంలో ప్రాజెక్టు వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. సందర్శకులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గద్వాలకు వెళ్లిపోయారు. కార్యక్రమంలో గేట్స్ డివిజన్ ఈఈ కెబేర్ అహ్మద్, ఏఈలు, ఏఈలు ఉన్నారు.

విద్యుత్ కార్మికుల పక్షాన పోరాడతాం


నూతనంగా ఎన్నికైన ట్రాన్స్‌కో రీజినల్ (ఉమ్మడి జిల్లా) కమిటీ సభ్యులు

- 1104 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబ
- ట్రాన్స్‌కో రీజినల్(ఉమ్మడి జిల్లా) అధ్యక్షుడిగా రఘువీర్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ కార్మికుల పక్షాన యూనియన్లు నిరంతరం పోరాటం చేయాలని విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబ అన్నారు. గురువారం స్థానిక యూనియన్ కార్యాయలంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా వారి తరఫున పోరాటం చేయాలన్నారు. కార్మికుల హక్కులను కాపాడిన రోజే యూనియన్లకు మనుగడ ఉంటుందన్నారు. అనంతరం ట్రాన్స్‌కో రీజినల్(ఉమ్మడి జిల్లా)కమిటీని ఎన్నుకున్నారు. ట్రాన్స్‌కో రీజినల్(ఉమ్మడి జిల్లా) జిల్లా అధ్యక్షుడిగా రఘువీర్‌రెడ్డి, రీజినల్ సెక్రటరీగా రాఘవేందర్‌గౌడ్, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జితేందర్‌రెడ్డి, రీజనల్ అడిషనల్ సెక్రటరీగా స్వామిగౌడ్, రీజినల్ ఉపాధ్యక్షులుగా స్వాతి, శివకుమార్, రీజినల్ ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సీహెచ్ చెన్నయ్య, ఎండీ ఇక్బాల్, రీజినల్ అసిస్టెంట్ సెక్రెటరీగా సత్యనారాయణ, రీజినల్ ట్రెజరర్‌గా ఎండీ మక్సూద్‌అలీ ఎన్నికయ్యారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖ ఉద్యోగులు, కార్మికులకు తాము అండగా ఉంటామని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు స్వామి పాల్గొన్నారు.

జూరాలకు 3.65 లక్షల క్యూసెక్కుల వరద


జూరాల నుంచి శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్న వరద

41 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గురువారం వరద ఉధృతి మరింత పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం 2.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం రాత్రి 8 గంటల సమయంలో 3.65 లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు వివరించారు. దీంతో ప్రాజెక్టు 41 క్రస్టుగేట్లు పైకెత్తి 3,80,365 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఆవిరి రూపంలో 40 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 550, కుడి కాల్వకు 320 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 5.885 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

పెరిగిన వరద.. నిలిచిన విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండటంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిపివేసినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. అత్యధికంగా వరద వస్తుండటంతో ఉత్పత్తి సాధ్యం కాదని ఇప్పటి వరకు 533.580 మి.యూ ఉత్పత్తి విజయవంతంగా చేపట్టామన్నారు.

కోయిల్‌సాగర్ రెండు గేట్ల ఎత్తి..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ జలాశయం రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేశారు. బుధవారం భారీగా వరద రావడంతో 5 గేట్లను ఎత్తగా.. గురువారం ఉదయం తగ్గడంతో రెండు గేట్ల ద్వారా, సాయంత్రం ఇన్‌ఫ్లో మరింత తగ్గడంతో ఒక గేటు నుంచి నీటి విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 32 అడుగులు ఉంది.

సుంకేసులకు నిలకడగా..

రాజోళి: సుంకేసుల జలాశయానికి గురువారం వరద నిలకడగా కొనసాగింది. ఎగువ నుంచి 1.45 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 19 గేట్లను రెండు మీటర్లు, ఒక గేట్‌ను ఒక మీటర్ మేర తెరిచి 1,39,100 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. అలాగే 2,534 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ మహేంద్ర వివరించారు.



అనారోగ్యంతో కేజీబీవీ విద్యార్థి మృతి

- ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే..
- బాధిత కుటుంబ సభ్యుల నిరసన
- విచారణ చేస్తామన్న ఎస్‌ఐ నరేష్, డీటీ లక్ష్మీకాంత్

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని తెలుగు మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి అనారోగ్యంతో ఈ నెల 17న మృతి చెందింది. పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే తమ కుమార్తె మృతి చెందిందని విద్యార్థి తల్లిదండ్రులతో పాటుగా కుటుంబ సభ్యులు గురువారం పాఠశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిల్లాఘనపురం మండలంలోని కోతులకుంటతండాకు చెందిన కెతావత్ శ్రీను, కవిత బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లారు. వారి కుమార్తె జ్యోతి మండల కేంద్రంలోని తెలుగు మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. జ్యోతితో పాటుగా పాఠశాలలోని 11 మంది ఈ నెల 8న అనారోగ్యం పాలవడంతో పాఠశాల అటెండర్ అనురాధ వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. జ్యోతికి జ్వరం ఎక్కువగా ఉందని వైద్యసిబ్బంది గ్లూకోజ్ పెట్టడంతో పాటుగా మొత్తం 11 మందికి మందులు ఇచ్చారు. విషయాన్ని జ్యోతి కుటుంబ సభ్యులకు చెప్పడంతో విద్యార్థినికి అన్న వరసయ్యే జగదీష్ వచ్చి విద్యార్థిని ఇంటికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో విద్యార్థినికి తెల్ల పసరికలు వచ్చాయని తేలడంతో మొదట బిజినేపల్లికి, మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆస్పత్రి, హైదరాబాద్‌లోని ఆకృతి ఆస్పత్రి, యశోద ఆస్పత్రిలో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 17న గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. ఈ క్రమంలో తమ కుమార్తె అనారోగ్యం పాలైన సరైన సమయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే చనిపోయింది శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు పాఠశాల ఆవరణలో ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరేష్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్ పాఠశాల వద్దకు చేరుకుని వారితో మాట్లాడారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం ఉంటే చర్యలు ఉంటాయని చెప్పడంతో విద్యార్థి బట్టలు, పుస్తకాలు తదితర వస్తువులు తీసుకుని కుటుంబ సభ్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.


జ్యోతి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేష్

రిజిస్టర్‌లో నమోదు చేయలే..

ఎస్‌ఐ నరేష్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్ విద్యార్థి పాఠశాల నుంచి ఎప్పుడు వెళ్లిందని రిజిస్టర్‌లో పరిశీలించగా.. ఎవరు తీసుకెళ్లారు, ఏ రోజు వెళ్లిందనే ఎలాంటి వివరాలు నమోదు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖచ్చితంగా ప్రతి విద్యార్థి పాఠశాల నుంచి ఎప్పుడు, ఎవరితో బయటకు వెళ్లిందని, తిరిగి తీసుకొచ్చిన వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.